**డాక్టర్ కె.లక్ష్మన్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు,**

**సెప్టెంబర్ 19న హైదరాబాదులోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడిన అంశాలు**

కేంద్ర మంత్రివర్గం నేడు ట్రిపుల్ తలాక్ పై ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని బిజెపి రాష్ట్ర శాఖ స్వాగతించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ పై ముస్లిం మహిళలు హర్షాతిరేకం, ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తున్నారని డా.లక్ష్మన్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకంగా అభివర్ణించారు. ప్రధాని నిర్ణయం లింగ సమానత్వానికి దోహదం చేస్తుందన్నారు. మహిళా సాధికారతకు బిజెపి పెద్దపీట వేస్తుందననడానికి ఇది తార్కాణం అని చెప్పారు. సైరా భాను అనే మహిళ తనకి జరిగిన అన్యాయం పట్ల సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన తీర్పిచ్చిందని తెలిపారు. ముస్లిం మహిళలకు న్యాయం చేయాలన్న తలంపుతో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, మహిళలకు అన్యాయం జరగకుండా నిలువరించిందని స్పష్టం చేశారు. ఇది ముస్లిం మహిళలకు నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చిన గొప్ప వరం అని అన్నారు.

ట్రిపుల్ తలాక్ సామాజిక రుగ్మతగా ఈ సమస్యను మతపరంగా కాకుండా, రాజకీయపరమైన కోణంలో కాకుండా మానవత్వంతో చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముస్లిం మహిళల సాధికారత కోసం, వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, ఆత్మవిశ్వాసాన్ని పాదుకొల్పాలన్న ధ్రుడ సంకల్పంతో ఈ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడితే.. లోక్ సభలో బిల్లుకు ఆమోదం తెలిపిన కాంగ్రెస్ కుంటిసాకులతో రాజ్యసభలో అడ్డుకొని తన నైజాన్ని బయటపెట్టుకుందని నిప్పులు చెరిగారు. ముస్లిం మహిళా సమాజానికి కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని, దీనిని ముస్లిం సమాజం గ్రహించిందన్నారు. కాంగ్రెస్ మోకాలడ్డడంతో రాజ్యసభలో పాస్ కాని ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా తీసుకొచ్చేందుకు ప్రయత్నించిందని, ఈ ఆర్డినెన్స్ కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

దేశంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదంతో మోదీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎంతోమంది సెల్ ఫోన్ ద్వారా, మొబైల్ ద్వారా మెసేజ్ ల ద్వారా మూడుసార్లు తలాక్ చెప్పి ముస్లిం మహిళలకు అన్యాయం చేస్తున్నారని, దీంతో వారి జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని

ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మహిళలకు సాధికారత, సముచిత స్థానం కల్పించాలన్న ఆలోచన కాంగ్రెస్ కు లేదని, ఓటుబ్యాంకుగానే పరిగణించి వారికి తాయిలాలు ఇచ్చిందని, మభ్యపెట్టిందని అన్నారు.

ముస్లిం మహిళల రక్షణకు సంబంధించిన ట్రిపుల్ తలాక్ పైనే కాకుండా బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రవేశపెట్టిన బిసి  కమిషన్ కు రాజ్యాంగ హోదా బిల్లును కూడా కాంగ్రెస్ అడ్డుకుందని డా. లక్ష్మన్ విరుచుకుపడ్డారు. కాకా కలేల్కర్ కమిషన్, మండల్ కమిషన్ నివేదికలను కాంగ్రెస్ బుట్ట దాఖలు చేసిందని విమర్శించారు. మతం పేరుతో విభజన రాజకీయాలను పాల్పడి నేడు కాంగ్రెస్ ముస్లిం సమాజం ముందు, దేశ ప్రజల ముందు ద్రోహిగా నిలబడిందన్నారు. 22 ముస్లిం దేశాలు పైగా ట్రిపుల్ తలాక్ ను నిషేధించారన్నారు. కానీ మనదేశంలో ఓటు బ్యాంక్ రాజకీయాలతో ముస్లిం మహిళలకు ద్రోహం చేసే పరిస్థితి కాంగ్రెస్ పార్టీ కల్పించిందని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాక్ నురద్దు చేయాలని స్పష్టంగా చెప్పినా అడ్డుపడిన కాంగ్రెస్ ద్వంద్వనీతికి అద్దం పడుతుందన్నారు. యూపీఏ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నా యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ ఒక మహిళ అయి ముస్లిం మహిళల ఆక్రందనను అర్థం చేసుకోలేదని విమర్శించారు. 'నారీ న్యాయ... నారీ గరిమ.. నారీ సమ్మాన్..' నినాదంతో మోదీ ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. మహిళలకు అన్యాయం చేసే ట్రిపుల్ తలాక్ ను మతంతో ముడిపెట్టిన ముస్లిం పర్సన లా బోర్డ్ ముస్లిం మహిళలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ముస్లిం మహిళల హక్కుల విషయంలో గాని, మత పరమైన అంశాల విషయంలో గానీ ముస్లిం లా జోక్యం చేసుకోలేదని వాపోయారు.

మహాకూటమి పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటుందని, దేశంలో రాహుల్ గాంధీ ఎక్కడ ప్రచారం చేసినా అక్కడ కాంగ్రెస్ ఓటమి పాలైందని, బిజెపి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఉత్తంకుమార్ రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని, బూటకపు మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమీ చేయలేనివారు మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు కాంగ్రెస్ ను కుంభకోణాల పార్టీగా,అవినీతి పార్టీ ,గానే పరిగణిస్తున్నారన్నారు కాంగ్రెస్, టీఆర్ఎస్ ఒకే గూటి పక్షులని.., కాంగ్రెస్ కు ఓటు వేసినా, టీఆర్ఎస్ కు ఓటు వేసినా ఒక్కటే అని.. ఇవన్నీ మజ్లిస్ ఖాతాలోకి చేరే ఓట్లేనని

స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు శాసించిన ఎంఐఎం ఇప్పుడు టిఆర్ఎస్ అధికారంలో ఉన్నా కారు స్టీరింగ్ ఎంఐఎం చేతిలోనే ఉందని, తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని హితువు పలికారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ గోత్రాలు ఒక్కటేనని, తెలంగాణలో కూడా బిజెపిని గెలిపించాలని, అభివృద్ధికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం అమిత్ షాకు ఉందని, త్వరలోనే మరో బహిరంగ సభను ఏర్పాటు చేయాలంటూ ఇవాళ నాతో ఫోన్ లో మాట్లాడారని అన్నారు. ఈ నెల 27న మహిళా సమ్మేళనంలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ పాల్గొంటున్నారని తెలిపారు. తెలంగాణలో మహిళలు బిజెపిని ఆదరిస్తారన్న విశ్వాసం ఉందన్నారు.

మోదీ విధానాల పట్ల, బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ఎంతో మంది బిజెపిలో చేరుతున్నారు. మహబూబ్ నగర్ సభ విజయవంతం కావడంతో పెద్ద ఎత్తున బిజెపిలో చేరికలు కొనసాగుతున్నాయి. ఇవాళ నిజామాబాదు జిల్లా ఆర్మూర్ నియోజకవర్గం నుండి టీఆర్ఎస్ కు రాజీనామా చేసిన వినయ్ కుమార్ రెడ్డి డాక్టర్ కె.లక్ష్మన్ సమక్షంలో బిజెపిలో చేరారు. జి.జ్యోతి, మాజీ జెడ్పీటీసీ (టీడీపీ), దేవికా శంకర్ నాయక్, మజీ జెడ్పీటీసీతో పాటు 100 మంది అనుచరులు డోర్నకల్, మహబూబాబాద్ జిల్లా నుంచి, కొత్త సారంగ రావు, రిటైర్డ్ ఎస్ఈ, రాజేశ్వర్ రావు, టీఆర్ఎస్ సర్పంచ్ వర్ధన్నపేట నుంచి, కస్తూరి అలివేణి, కవి, రచయిత హైదరాబాద్ నుంచి, ఆడం, రిటైర్డ్ టీచర్, ఆలంపూర్ నుంచి 1000 మంది బిజెపిలో చేరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, గద్వాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణి, డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్.వి.సుభాష్, కొల్లి మాధవి, రాకేశ్ రెడ్డి, కోశాధికారి శాంతి కుమార్, భూపతి భూపతిరెడ్డి, ధర్మపురి అరవింద్ లతో పాటు అనేక మంది పాల్గొన్నారు.